సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 17 । మార్చి । 2023



అడవిలో అగ్గి వరుసలు 8లో▸

అడవిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా అటవీశాఖ నూతన విధానాన్ని ప్రవేశ పెట్టింది. అడవిలో కూలీల ద్వారా ఫైర్‌లైన్స్ (అగ్గి వరుసలు) ఏర్పాటు చేస్తోంది.



మత్స్యకారులకు వరం

తాంసి మండలం వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్ట్ మత్స్యకారులకు వరంలా మారింది. దీని ద్వారా 200 కుటుంబాలవారు జీవనోపాధి పొందుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0/19.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 'నిమిషం' నిబంధన ఉండడంతో విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. 8,574 మంది జనరల్ విద్యార్థులకు 8,096 మంది, 974మంది ఒకేషనల్ విద్యార్థులకు 814 మంది హాజరైనట్లు డీఐఈవో రవీందర్‌కుమార్ తెలిపారు.

కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలి

కైలాస్‌నగర్: ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన, ఆరోగ్యశ్రీ వైద్య సహాయానికి ఆహారభద్రత కార్డులు (ఎఫ్ఎస్‌సీ) కలిగిన వారంతా అర్హులేనని ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ ఆర్.సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. వీరంతా తమ ఆధార్‌కార్డు, బ్యాంక్ లింక్ కలిగిన మొబైల్ నంబర్లతో ఈ నెల 31వ తేదీలోపు కేవైసీ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య మిత్రలు, సీఎస్‌సీ సెంటర్ల నిర్వాహకులతోపాటు జోఫర్ కంపెనీ, స్మార్ట్ ఐటీ, యూటీఐ ఏజెన్సీల ఆధ్వర్యంలో కేవైసీ అప్‌డేషన్ జరుగుతోందని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తిగా ఉచితమని, ఎక్కడైనా డబ్బులు అడిగితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న పుల్లయ్య

తలమడుగు: మండలంలోని భరంపూర్ గ్రామంలో గురువారం జొన్న, మక్క, వేరుశనగ, నువ్వు తదితర పంటలను జిల్లా వ్యవసాయాధికారి డీ పుల్లయ్య పరిశీలించారు. రబీలో సాగు చేసిన పంటలకు వచ్చే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు ఎక్కువ మోతాదులో క్రిమిసంహారక మందులు పిచికారీ చేయవద్దని, సేంద్రియ ఎరువులు వాడి అధిక దిగుబడి సాధించాలని పేర్కొన్నారు. సాగులో సందేహాలు, తెగుళ్ల నివారణ చర్యల కోసం సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఏవో మహేందర్, ఏఈవో రమేశ్, శ్రావ్య, రైతులు పాల్గొన్నారు.

నేడు స్వగృహ ప్లాట్ల వేలం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

కైలాస్‌నగర్: అగ్రజా టౌన్‌షిప్ పేరిట ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేఅవుట్‌లోని ఓపెన్ ప్లాట్ల మలి విడత విక్రయాలకు శుక్రవారం ఉదయం 10గంటల నుంచి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆసక్తి గల వారు 'కలెక్టర్, ఆదిలాబాద్' పేరిట రూ.10వేల డీడీ తీసి శుక్రవారం జరిగే వేలంలో పాల్గొనాలని సూచించారు. డీడీలు తీసుకునేందుకు జెడ్పీ సమావేశ మందిరం వద్దే తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చదరపు గజానికి ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర రూ.8వేల చొప్పున వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్‌భాషా షేక్, ట్రైనీ కలెక్టర్ శ్రీజ ఉన్నారు.

ఆర్టీసీ ద్వారా రాములోరి కల్యాణ తలంబ్రాలు

ఆదిలాబాద్: ఆర్టీసీ కార్గో సేవల ద్వారా శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలను బుక్ చేసుకుంటే ఇంటి వద్దే అందిస్తామని ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీరామనవమి రోజున భద్రాద్రి రామయ్య–సీతమ్మ కల్యాణ వేడుకల్లో ఉపయోగించిన కోటి గోటి తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా అందించనున్నట్లు వెల్లడించారు. కల్యాణ మహోత్సవానికి భద్రాచలం వెళ్లలేని భక్తులు కార్గో సర్వీస్ కేంద్రంలో రూ.116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శ్రీరామనవమి అనంతరం కార్గో హోం డెలివరీ సేవల ద్వారా తలంబ్రాలను ఇంటి వద్దకు వచ్చి అందజేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఆదిలాబాద్–ఉట్నూర్ డిపో 9154298531, ఆసిఫాబాద్ డిపో 9154298534, మంచిర్యాల్ డిపో 7780256680, నిర్మల్ డిపో 9154298547, భైంసా డిపో 9154298539, ఆర్ఎం కార్యాలయం 9154298552, 9154298553 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని జానీరెడ్డి కోరారు.

కాంగ్రెస్ పీపుల్ మార్చ్

- హాథ్‌సే హాథ్ జోడో అభియాన్‌లో భాగంగా భట్టి పాదయాత్ర షురూ..
- పిప్రి నుంచి ఇచ్చోడ వరకు
- కదిలివచ్చిన ఉమ్మడి జిల్లా శ్రేణులు
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం



పాదయాత్రలో అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క, పక్కన మాణిక్‌రావ్ ఠాక్రే, వీహెచ్, శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, ఆదిలాబాద్/ఇచ్చోడ: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తలపెట్టిన భారీ పాదయాత్ర గురువారం ఆదిలాబాద్ జిల్లా నుంచి అట్టహాసంగా ప్రారంభమైంది. 'హాథ్‌సే హాథ్ జోడో అభియాన్' కొనసాగింపులో భాగంగా 'పీపుల్స్ మార్చ్' పేరిట పాదయాత్ర ప్రారంభించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామం నుంచి యాత్ర మొదలైంది. సాయంత్రం 6గంటలకు ఇక్కడికి చేరుకున్న ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. బ్యాండ్ మేళాలు, డప్పుల దరువులు, గిరిజన నృత్యాలతో కళాకారులు స్వాగతం పలికారు. పోరాట యోధుడు కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ముఖ్య నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా నేతలు రాష్ట్ర నాయకులకు హారతిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే సమక్షంలో భట్టి పాదయాత్ర ప్రారంభించారు. ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావిద్, రోహిత్ చౌదరి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పీసీసీ మాజీ అధ్యక్షుడు వీహెచ్ హన్మంతారావు, భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు పాల్గొన్నారు. పిప్రి నుంచి ఇచ్చోడ వరకు సుమారు నాలుగు కిలో మీటర్ల పాదయాత్ర కొనసాగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున శ్రేణులు కదిలివచ్చారు. ఇచ్చోడలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్య నేతలతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేతలు కూడా ప్రసంగించారు. ప్రజాగాయకుడు గద్దర్ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం భారీ జనసందోహాన్ని ఉద్దేశించి భట్టి విక్రమార్క ప్రసంగించారు.

ఆలస్యంగా ప్రారంభం..

భట్టి విక్రమార్క పాదయాత్ర సాయంత్రం 4గంటలకు మొదలవుతుందని ముందుగా పార్టీ ప్రకటించింది. అయితే ఆయన 6 గంటలకు పిప్రికి చేరుకున్నారు. అక్కడినుంచి పాదయాత్రగా రాత్రి 8.30 గంటల వరకు ఇచ్చోడకు చేరుకున్నారు. కార్నర్ మీటింగ్ సుదీర్ఘంగా సాగింది. దీంట్లో నియోజకవర్గ నేతల నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి నేతల వరకు ప్రసంగించారు. చివరగా భట్టి ప్రసంగించారు.

అంతా ప్రేమ్‌సాగర్‌రావే..

భట్టి విక్రమార్క పాదయాత్రను ఆదిలాబాద్ జిల్లా నుంచి తలపెట్టగా, ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు దీన్ని విజయవంతం చేసేందుకు శాయశక్తులా కృషి చేశారు. మొత్తంగా ఈ కార్యక్రమాన్ని తన భుజాన వేసుకొని నడిపించారు. ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా ఈ పాదయాత్రలో పాల్గొంటారని మొదట భావించారు. అయితే నిర్మల్ జిల్లా వరకే తన పాదయాత్ర పరిమితం చేయడంతో ఆయన అలకబూనారని ప్రచారం జరుగుతోంది. దీంతో భట్టి యాత్రకు ఆయన దూరంగా ఉన్నారు. పిప్రికి వచ్చేటప్పుడు మార్గంమధ్యలో నిర్మల్‌లో ఆగిన భట్టి మహేశ్వర్‌రెడ్డిని కలిసి సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ ఆయన దిగిరానట్టు తెలుస్తోంది. దీంతో పాదయాత్ర షెడ్యూల్ కంటే రెండు గంటలు ఆలస్యంగా మొదలైందనే ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తన అనుచరులుగా ఉన్న నియోజకవర్గ నేతల ద్వారా ప్రేమ్‌సాగర్‌రావు చుట్టుపక్కల నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, జనాలు వచ్చేలా సమీకరణ చేశారు. దీంతో పాదయాత్రలోనూ, ఇటు కార్నర్ మీటింగ్‌లోనూ జనసందోహం కనిపించింది. మొత్తంగా ఆదిలాబాద్ జిల్లాలో భట్టి పాదయాత్ర మొదటిరోజు సక్సెస్ అయింది. గురువారం రాత్రి ఇచ్చోడలోనే భట్టి విక్రమార్క బస చేశారు. శుక్రవారం ఇచ్చోడ నుంచి ఆయన పాదయాత్ర సిరికొండ వరకు సాగనుంది. అక్కడే కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యేపై కాంగ్రెస్ చార్జ్‌షీట్!

బోథ్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు కాంగ్రెస్‌పై నిరసన తెలిపారు. దీంతో ఆయనపై పార్టీ పరంగా చార్జ్‌షీట్ ఓపెన్ చేశారు. 'భట్టే బాజ్ బాపురావు' అంటూ ఆ చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. దళితబంధు ఇస్తానని మోసగించారని, లబ్ధిదారుల నుంచి రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్థిరాస్తి వ్యాపారంలో దౌర్జన్యం చేస్తున్నారని, కాంట్రాక్టర్లు కమీషన్లు ఇవ్వడం లేదని ప్రాజెక్టులు ప్రారంభం కాకుండా చూస్తున్నారని విమర్శించారు. డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా డిగ్రీ కళాశాల సాధించలేకపోయారని చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనుచరులు దళితుల భూములు కబ్జా చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని అందులో వివరించారు. బాపురావును తరిమికొడదామని, బోథ్ నియోజకవర్గాన్ని కాపాడుకుందామని చార్జ్‌షీట్‌లో పిలుపునిచ్చారు.

ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన నేతలు

ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున నేతలు తరలివచ్చారు. దీంతో కాంగ్రెస్‌లో ఉత్సాహం కనిపించింది. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ కార్యదర్శి గండ్రత్ సుజాత, బోథ్ నియోజకవర్గం నుంచి డాక్టర్ వన్నెల అశోక్, ఆడె గజానంద్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, సీనియర్ నాయకులు నరేశ్‌జాదవ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఉన్నారు.



పాదయాత్రలో పార్టీ శ్రేణులు

పిప్రి నుంచి యాత్ర షురూ..

బజార్‌హత్నూర్: ఏఐసీసీ పిలుపుతో టీపీసీసీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లాలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క గురువారం చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే మండలంలోని పిప్రి గ్రామంలో ప్రారంభించారు. ముందుగా భట్టి కొమురంభీం, మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు వీ హన్మంతారావు, భద్రాచలం, మంథని ఎమ్మెల్యేలు పోదెం వీరయ్య, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ రాములునాయక్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావ్, డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి గండ్రత్ సుజాత, వెన్నెల అశోక్, జెడ్పీటీసీలు మల్లెపూల నర్సయ్య, సున్నం నాగమణి, రాంబాబు, వీరభద్రం, పసుల సంటి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. పిప్రి గ్రామంలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రాహుల్ చౌదరి, నాయకులు నాయిని రాజేందర్, సత్తు మల్లయ్యను టీపీసీసీ ప్రధానకార్యదర్శి గండ్రత్ సుజాత శాలువాలతో సత్కరించారు.

ఎల్‌పీడీ నుంచి గట్టెక్కేనా?



జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు

- కనీస సామర్థ్యాల నిర్ధారణకు న్యాస్
- 3, 5 తరగతుల విద్యార్థులకు పరీక్ష
- జిల్లాలో 74 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- జిల్లా వ్యాప్తంగా 1,722 మంది ఎంపిక

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ స్థాయిలో విద్యాపరంగా జిల్లా వెనుకబడి ఉంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు చాలామంది విద్యార్థులు చదవడం, రాయడం, చతుర్విద ప్రక్రియలు చేయడంలో వెనుకబడి ఉన్నట్లు ఇదివరకు నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పరీక్షలో తేలింది. దేశ వ్యాప్తంగా 10 జిల్లాలను లోపెర్ ఫార్మెన్స్ డిస్ట్రిక్ట్ (ఎల్‌పీడీ)గా గుర్తించారు. అందులో ఆదిలాబాద్ జిల్లా ఉన్న విషయం తెలిసిందే. విద్యార్థుల సామర్థ్యాల పెంపు కోసం మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థుల కోసం ఏడాది పాటు విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీని జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించి తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే నవంబర్‌లో న్యాస్ మధ్యంతర పరీక్ష జరిగింది. ఆ పరీక్షలో 80 శాతం మంది జిల్లా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడినట్లు తేలింది. అయితే గురువారం తుది దశ న్యాస్ పరీక్ష నిర్వహించారు. మధ్యంతర ఫలితాలను నిలబెట్టుకునేనా? లేకుంటే మళ్లీ ఎల్‌పీడీ జిల్లాగానే మిగిలిపోతుందా? అనేది నెల తర్వాత వచ్చే ఫలితాలపై ఆధారపడి ఉంది.

విద్యార్థుల సామర్థ్యాలకు పరీక్ష

విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించేందుకు గురువారం న్యాస్ పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 74 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, మూడో తరగతి విద్యార్థులు 835 మంది, ఐదో తరగతి విద్యార్థులు 838 మందిని ఎంపిక చేశారు. ఉదయం 10నుంచి 12గంటల వరకు పరీక్ష నిర్వహించారు. ఐదు ఉర్దూ, ఒక మరాఠీ, 35 ఇంగ్లిష్, 29 తెలుగు మీడియం పాఠశాలల విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తంగా 32 ప్రైవేట్, 38 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. డైట్ ఛాత్రోపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించగా, జాతీయ పరిశీలకులు సుభాష్‌గుప్తా, సుజీత్ చౌదరి 12 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్, డీఈవో ప్రణీత పరీక్ష కేంద్రాలు సందర్శించారు.

మధ్యంతర ఫలితాలు నిలబెట్టుకునేనా?

2017లో జరిగిన న్యాస్ ఫలితాల ఆధారంగా ఆదిలాబాద్‌ను చదువులో అత్యంత వెనుకబడిన జిల్లాగా గుర్తించారు. 41 శాతం విద్యార్థులు మాత్రమే చదవడం, రాయడం, చతుర్విద ప్రక్రియలు చేయగలరని న్యాస్ పరీక్ష ద్వారా తేలింది. విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. జూలై నుంచి ఇప్పటివరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. నవంబర్‌లో న్యాస్ మధ్యంతర పరీక్ష నిర్వహించగా 80 శాతం విద్యార్థుల సామర్థ్యాలు పెరిగినట్లు తేలింది. తుదిదశ పరీక్షలో మధ్యంతర పరీక్ష కంటే ఫలితాలు ఎక్కువగా వస్తాయా? లేక తక్కువగా వస్తాయా? అనేది తేలనుంది. 50శాతం కంటే విద్యార్థుల ఫలితాలు తక్కువగా ఉంటే మళ్లీ చదువులో వెనుకబడిన జిల్లాగా గుర్తించి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయనున్నారు. ఎల్‌పీడీ నుంచి బయట పడేందుకు ఇదివరకు జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర విద్యాశాఖ జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. అయితే మధ్యంతర ఫలితాల్లో 40 శాతం నుంచి ఒకేసారి 80 శాతం పెరగడంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆ పరీక్షల్లో కొంతమంది ఛాత్రోపాధ్యాయులు స్వయంగా విద్యార్థులతో రాయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే ఈసారి కూడా కొన్ని పరీక్ష కేంద్రాల్లో ఇలాగే వ్యవహరించినట్లు సమాచారం.

తుదిదశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాం



ఎల్‌పీడీ జిల్లా నుంచి ఈసారి బయట పడతాం. ఏడాదిపాటు మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. తొలిమెట్టు, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలు చేపట్టి అభ్యసన సామర్థ్యాల పెంపుదలకు చర్యలు చేపట్టాం. 74 పరీక్ష కేంద్రాల్లో 1,722 మంది విద్యార్థులు న్యాస్ పరీక్ష కోసం ఎంపికయ్యారు. జాతీయ పరిశీలకులు పరీక్ష కేంద్రాలు సందర్శించారు. మధ్యంతర ఫలితాల కంటే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

'దళారులకు విక్రయించి మోసపోవద్దు'



యార్డులో శనగ పంటను పరిశీలిస్తున్న నటరాజ్

ఆదిలాబాద్‌టౌన్: శనగ పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని అదనపు కలెక్టర్ నటరాజ్ రైతులకు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా శనగ కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లు రైతుల నుంచి నాణ్యమైన పంటను కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని సూచించారు. క్రాప్ బుకింగ్ ఆధారంగా పంటలు కొనుగోలు చేయాలని, మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, ఆదిలాబాద్ మార్కెట్ కార్యదర్శి వెంకట్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారులపై గుర్తించిన బ్లాక్ స్పాట్‌లలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు ఇండికేషన్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. వేగ నిరోధక స్ట్రిప్స్‌లను అమర్చాలని సూచించారు. గత సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు చర్చించిన మేరకు పనులు పూర్తిచేసి ప్రమాదాల నివారణకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిపాదించిన పనులు ఈ నెలాఖరులోగా పూర్తిచేసి నివేదికలు అందించాలని ఆర్‌అండ్‌బీ ఈఈని ఆదేశించారు. ఎస్పీ డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నేరడిగొండ నుంచి కుప్టి వరకు, టోల్ ప్లాజా నుంచి నేరడిగొండ గ్రామం వరకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. గుడిహత్నూర్ నుంచి సీతాగొంది వరకు వెళ్లే దారిలో వేగ నిరోధకాలు, సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. బోరజ్ చెక్‌పోస్ట్ వద్ద సర్వీస్ రోడ్డు వైపు వెళ్లే వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని తెలిపారు. పులిమడుగు, ఇంద్రవెల్లి, శ్యాంపూర్‌కు వెళ్లే రహదారిలో న్యారో బ్రిడ్జిల వద్ద సూచిక బోర్డులు, రాత్రి వేళ వాహనదారులకు తెలిసేలా రేడియం స్టిక్కర్లతో కూడిన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలోని వివిధ కూడళ్లు, రిమ్స్ ఆస్పత్రి ఎదుట ప్రమాదాల నివారణకు వేగనిరోధకాలు అమర్చాలని సూచించారు. అన్ని శాఖల సహకారంతో ప్రమాదాలు నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, అడిషనల్ కలెక్టర్లు రిజ్వాన్‌బాషా షేక్, ఎన్.నటరాజ్, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో రమేశ్‌రాథోడ్, డీఎస్పీ ఉమేందర్, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, పీఆర్ ఈఈ మహవీర్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద గిరిజనులకు ప్రభుత్వ సహకారం

- కలెక్టర్ రాహుల్ రాజ్
- రాయిసెంటర్ సభ్యులు, ఐటీడీఏ డైరెక్టర్లతో ప్రత్యేక సమావేశం

కైలాస్‌నగర్: ఇళ్లు, భూములు లేని నిరుపేద గిరిజనుల జాబితా సిద్ధం చేయాలని, వారికి ప్రభుత్వ సహకారం అందిస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని రాయి సెంటర్ సభ్యులు, ఐటీడీఏ డైరెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గిరిజనుల స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంస్కృతీసంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాలని తెలిపారు. గిరిజన మహిళలు రక్త హీనత బారిన పడకుండా పౌష్టికాహారం, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, రైతులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. గిరిజన సంస్కృతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ తన పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయి పనులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో మంజూరైన రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయిస్తామని, వానాకాలం నాటికి రవాణాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మారుమూల గ్రామాల్లోని గర్భిణులను ప్రసవ సమయానికి ముందే సమీప ప్రభుత్వ ఆస్పత్రుల్లోని బర్త్ వెయిటింగ్ రూమ్‌లో ఉంచి ప్రసవానంతరం వారి గ్రామాలకు పంపిస్తామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో 8,500 మంది గిరిజనులు సాగు చేస్తున్న అటవీ భూములకు హక్కు పత్రాలు అందిస్తామని చెప్పారు. పీవీటీజీ గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కల్పిస్తామని, అర్హులందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఎల్‌టీఆర్ కేసులు, ప్రాజెక్ట్ అధికారి కోర్టులో ఉన్న కేసులు పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గిరి వికాసం కింద త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని, బోరు బావులు, విద్యుత్ మోటర్లు మంజూరు చేసి సాగుకు యోగ్యంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ప్రతీ నెల నాలుగో శనివారం రాయి సెంటర్ సమావేశాన్ని కొనసాగిస్తామని తెలిపారు. రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి భూ సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. ట్రైనీ కలెక్టర్ పీ శ్రీజ, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, గిరిజన సంక్షేమశాఖ డీడీ దిలీప్‌కుమార్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఎదులాపురం: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా అంగన్‌వాడీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న 'చలో కార్యదర్శి' చేపట్టనున్న నేపథ్యంలో ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 45 ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసులు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పెన్షన్ గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని, ఐసీడీఎస్‌ను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 28న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకళ, ఏఐటీయూసీ నాయకులు సిర్ర దేవేందర్, గాజంగుల రాజు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సంగీత, ఛాయ, ఇందు, హేమలత, దుర్గ, సురేఖ, సంఘమిత్ర, అనసూయ, లక్ష్మీరాధ పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని ఐకేపీ వీవోఏల సమ్మె

కైలాస్‌నగర్: తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీవోఏలు టోకెన్ సమ్మెకు దిగారు. విధులు బహిష్కరించి గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐకేపీ వీవోఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టీ లక్ష్మణ్‌చారి, డీ అరుణ్ మాట్లాడారు. 20 ఏళ్లుగా గ్రామీణ ప్రాంత నిరుపేదల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని తెలిపారు. అన్ని రకాల రుణాలు ఇప్పించడం, తిరిగి బ్యాంకులకు సక్రమంగా చెల్లించేలా చూస్తున్నామని చెప్పారు. ఇంతటి కీలక విధులు నిర్వర్తిస్తున్న తమకు నెలకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని, ఆన్‌లైన్ పనులు రద్దు చేయాలని, సెర్ప్ నుంచి ఐడీ కార్డులు, యూనిఫాంలు అందించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న వీవోఏలు

క్లుప్తంగా

'విద్యావిధానంలో సంస్కరణలు రావాలి'



మాట్లాడుతున్న వీసీ వెంకటరమణ

భైంసా(ముధోల్): విద్యావిధానంలో సంస్కరణలు రావాలని బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ, ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. గురువారం 'ఉన్నతవిద్యలో నూతన సంస్కరణలు' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల మేధోమథనం సదస్సుకు హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రపంచస్థాయి సంస్థలను సృష్టించాలని, 2035 నాటికి స్థూల నమోదు నిష్పత్తి కనీసం 50శాతానికి పెంచాలన్నారు. ఉన్నత విద్యలో నూతన దృష్టితో కూడిన విద్యావనరులను బహుభాషా విషయ(మల్టీ డిసిప్లినరీ) సంస్థలతో నిర్వహించాలన్నారు. టీ హబ్ సహకారంతో ఆర్జీయూకేటీలో చేస్తున్న సాంకేతిక కసరత్తును వివరించారు.

తెలంగాణ జట్టు కోచ్‌గా కబీర్ దాస్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాల శిక్షకుడు కబీర్ దాస్ పూణేలో జరగనున్న జాతీయ పారా ఒలంపిక్స్, లక్నోలో జరగనున్న బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ జట్టు శిక్షకునిగా ఎంపిక కావడం గొప్ప విషయమని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారధి అన్నారు. ఈమేరకు గురువారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆయనకు సన్మానం చేశారు. క్రీడా పాఠశాల శిక్షకులు ఆనంద్ భాస్కర్, రవీందర్, రాజు తదితరులు ఉన్నారు.

అకాల వర్షం.. రైతన్నకు నష్టం

లోకేశ్వరం(ముధోల్): మండలంలోని అబ్దుల్లాపూర్, రాయపూర్ కాండ్లీ, ధర్మోరా, పంచగుడి, పిప్రి, వట్టోలి, అర్లిగొడిసెరా, నగర్, గడ్‌చాంద తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. వర్షానికి వరి, మొక్కజొన్న, జొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు విరిగి నెలకొరిగాయి. మొక్కజొన్న కేంద్రాలకు తరలించిన మొక్కజొన్నలు, గోనె సంచుల్లో నింపిన మొక్కజొన్నలు పూర్తిగా తడిసిపోయాయి. నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

భాగ్యనగర్ సర్పంచ్‌పై కేసు

నిర్మల్‌రూరల్: మండలంలోని భాగ్యనగర్ సర్పంచ్, అతని బంధువులు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అకారణంగా దాడిచేసి, ఇంట్లో ఫర్నిచర్ ధ్వంసం చేసినందుకు కేసు నమోదు చేసినట్లు నిర్మల్ రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన ముప్కాల్ నర్సారెడ్డి తన పంట పొలం పక్కనే ఉన్న గ్రామ నర్సరీలో ఉన్న ప్రభుత్వ బోరు ద్వారా సర్పంచ్ కారగిరి భూమన్న ఇతర పంట పొలాల్లోని రైతులకు డబ్బులు తీసుకొని నీళ్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దీంతో తన పొలంలో ఉన్న బోరు నీళ్లు అడుగింటుతున్నాయని పేర్కొన్నాడు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎంపీడీవో సాయిరాంకు గురువారం ఫిర్యాదు చేశాడు. దీంతో కోపద్రక్తులైన సర్పంచ్ భూమన్న, అతని బంధువులైన తిరుపతి, రమేశ్, గంగాధర్, మహేందర్, లక్ష్మి, రాధ నర్సారెడ్డి ఇంటికి వెళ్లి అతనితోపాటు అతని భార్యపై దాడి చేశారు. టీవీ, ఫర్నిచర్, మోటార్ సైకిల్ ధ్వంసం చేశారు. సర్పంచ్ భూమన్న, అతని బంధువులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అడవిలో అగ్గి వరుసలు

- శాటిలైట్ ద్వారా అగ్ని ప్రమాదాల సమాచారం
- ముందస్తుగా గ్రామాల్లో అవగాహన



అగ్గి వరుసలు తయారు చేస్తున్న కూలీలు

జన్నారం: వేసవి కాలంలో అడవిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా అటవీ శాఖ అధికారులు నూతన విధానాన్ని అవలంబిస్తున్నారు. ఈసారి కవ్వాల్ టైగర్‌జోన్‌లోని అన్ని అటవీ డివిజన్లలో ఆచరిస్తున్నారు. వేసవిలో అడవిలో అగ్ని ప్రమాదాలు పొంచి ఉంటాయి. అడవి కాలి వన్యప్రాణులు, చెట్లు, పక్షులకు ప్రాణహాని పొంచి ఉంటుంది. వేసవిలో అగ్ని ప్రమాదాలు నివారించి అడవికి నిప్పు తగలకుండా ఆపేందుకు అడవిలో కూలీల ద్వారా ఫైర్ లైన్స్(అగ్గి వరుసలు) ఏర్పాటు చేసి వాటికి నిప్పు పెడితే అడవంతా రగిలే అవకాశం ఉండదనే ఉద్దేశంతో అధికారులు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వేసవిలో అడవిలో నిప్పు తగులకుండా మంచి ఫలితాలు ఇస్తున్నాయి. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని ఖానాపూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల, జన్నారం అటవీ డివిజన్లలోని అన్నీ అటవీ బీట్‌లలో ఫైర్‌లైన్ పనులు చేయిస్తున్నారు. జిల్లాలోని ఫైర్‌లైన్స్ కోసం కాంపా స్కీం కింద నిధులు కేటాయించి సిబ్బందితో ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా అగ్గి పడిందని సమాచారం అందగానే సంబంధిత అధికారులు పరుగులు తీయాల్సి ఉంటుంది. బేస్‌క్యాంపు సిబ్బంది, బీట్ అధికారులు ఆ స్థలానికి వెళ్లి బ్లోయర్‌లతో మంటలు వ్యాపించకుండా ఆకులను తొలగించి ప్రమాదాలు నివారిస్తున్నారు. అగ్గి వరుసలతో జిల్లాలోని కోర్ ఏరియాలో ఈ ఏడాది ప్రమాదాలు తగ్గగా.. బఫర్ ఏరియాలో కూడా చాలా వరకు తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు.

శాటిలైట్ ద్వారా అప్రమత్తం

అటవీ శాఖ ఉన్నతాధికారులు అగ్ని ప్రమాదాల నివారణకు టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ ఎస్ఎన్‌పీపీ అనే శాటిలైట్ ఏర్పాటు చేశారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా డెహ్రాడూన్ ఆధ్వర్యంలో శాటిలైట్ ద్వారా ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నా సమాచారం చేరవేస్తారు. ప్రతీ రోజు 24గంటలు ఏ చోట అగ్ని ప్రమాదం జరిగిన, జరుగుతున్న ప్రదేశంపై సంబంధిత అధికారులకు మొబైల్ ఫోన్‌కు మెస్సేజ్ వస్తుంది. కంపార్టుమెంటు నంబరుతో సహా తెలియజేస్తారు. దీంతో సంబంధిత అధికారులు జీపీఎస్ ద్వారా ఆ ప్రాంతానికి వెళ్లి మంటలు ఆర్పేస్తారు. అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలనూ గుర్తించి హెచ్చరికలు జారీ చేస్తారు. డివిజన్ స్థాయిలో డివిజన్ అధికారి మొబైల్‌ఫోన్‌కు, రేంజ్ అధికారికి తన రేంజ్ పరిధిలోని బీట్‌లలో, బీట్ అధికారికి తన బీట్ పరిధిలో అగ్ని ప్రమాదాలు జరిగే ప్రదేశం మెస్సేజ్‌లు వెళ్తాయి. దీంతో అధికారులు అప్రమత్తమై చర్యలు తీసుకుంటారు.

గ్రామాల్లో అవగాహన సదస్సులు

అటవీ సమీప గ్రామాల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాలు, నష్టంపై అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. పశువుల కాపరులు అగ్గిపెట్టలు, సిగరెట్, బీడీలు అడవిలోకి తీసుకెళ్లకుండా చూస్తున్నారు. పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టడం, చెత్త అడవిలో వేసి కాల్చడం చేయకుండా అవగాహన కల్పిస్తున్నారు.

టైగర్ రిజర్వ్‌పై ప్రత్యేక శ్రద్ధ

కవ్వాల్ టైగర్‌జోన్‌లో జన్నారం డివిజన్‌లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అడవుల్లో పర్యటించడం, అగ్ని ప్రమాదం జరిగినట్లు తెలిస్తే సిబ్బంది వెంటనే అగ్నిమాపక కిట్లతో వెళ్లి ఆర్పడం చేస్తున్నారు. ఇటీవల డివిజన్‌లోని బఫర్ ఏరియాలో అగ్ని ప్రమాదం జరుగుతున్నట్లు రాత్రి 11 గంటలకు శాటిలైట్ సమాచారం ఇవ్వడంతోసంబంధిత బీట్ అధికారిని అప్రమత్తం చేశారు. రాత్రి ఒంటిగంట వరకుమంటలు ఆర్పేశారు. గత ఏడాది మార్చి వరకు 180చోట్ల అగ్ని ప్రమాదాలు జరుగగా, ఈ ఏడాది ఇప్పటివరకు 72చోట్ల ఫైర్‌పాయింట్లు చూపుతూ మెస్సేజ్‌లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. గత మూడేళ్ల క్రితంతో పరిశీలిస్తే ఇప్పుడు అడవుల్లో అగ్ని ప్రమాదాలు చాలావరకు తగ్గుముఖం పట్టినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి 10 వరకు 1400 వరకు ఫైర్ పాయింట్లు రాగా, ఖానాపూర్ డివిజన్‌లో 600, జన్నారం డివిజన్‌లో 72, ఆసిఫాబాద్ డివిజన్‌లో 380, ఉట్నూర్ డివిజన్‌లో 350 వరకు ఫైర్‌పాయింట్ల మెస్సేజ్‌లు వచ్చినట్లు తెలిపారు.

ఫైర్‌లైన్స్ అంటే..

అడవిలో ప్రస్తుతం ఆకులు రాలిపోతాయి. పశువుల కాపరులు, అడవికి వెళ్లిన వారు గానీ బీడీ, చుట్ట తాగి పడేస్తే ఎండిన ఆకులకు అంటుకుని అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. మంటలు అడవంతా వ్యాపించి పక్షులు, చెట్లు, వన్యప్రాణులకు హాని కలిగే అవకాశం ఉంది. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్ సిస్టం ఏర్పాటు చేశారు. ప్రతీ బీట్‌లోని అటవీ ప్రాంతంలో ఎడ్లబండ్ల తొవ్వలు, కాలినడక తొవ్వలకు ఇరువైపులా ఎండిన ఆకులను ఎయిర్‌బ్లోయర్లతో ఐదు మీటర్ల వెడల్పులో పోగు చేస్తారు. దారులు నున్నగా చేసి పోగు చేసిన ఆకులకు నిప్పంటించి కాల్చేస్తారు. పూర్తిగా కాలిపోయే వరకు పర్యవేక్షిస్తారు. ఫలితంగా ఎవరైనా బీడీ కోసం నిప్పంటించుకుని అగ్గిపుల్ల పడేసినా నిప్పంటుకునే అవకాశం ఉండదు. దారులపై ఎండిన ఆకులు ఉండకుండా చూస్తారు. ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నా ఈ దారుల వరకే వ్యాపించి ఆగుతుంది. అన్ని డివిజన్లలోని కంపార్ట్‌మెంట్, బీట్, డివిజన్, బౌండరీలలో ఈ అగ్గి వరుసలు వేస్తారు. ఈ ఏడాది కూ డా బెల్లంపల్లి, చె న్నూరు, జన్నారం, మంచిర్యాల అటవీ డివిజన్లలో అడవుల్లో ఫైర్‌లైన్‌లు ఏర్పాటు చేసి ఆకులను కాల్చుతున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో 40 బీట్‌లలో సుమారుగా 495 కిలోమీటర్ల దూరంలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.



మంటల నుంచి ఆకులను దూరం చేస్తున్న సిబ్బంది

సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం



వేసవి వచ్చిందంటే అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేసి సమాచారం అందిన వెంటనే సిబ్బందిని అక్కడికి పంపిస్తున్నాం. ఒక్కోసారి రాత్రి కూడా సిబ్బంది బ్లోయర్లతో అగ్గి రాజుకోకుండా ఆకులను దూరం చేసి ఫైర్‌లైన్‌లు చేస్తున్నారు. కోర్ ఏరియాలో ఈ సంవత్సరం ప్రమాదాలు లేవు.

– మాధవరావు, ఎఫ్‌డీవో, జన్నారం

బీఆర్ఎస్ నేతలతో మంత్రి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో బీఆర్ఎస్ ముఖ్య నేతలతో గురువారం రాత్రి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధిని గడపగడపకూ తీసుకెళ్లాలని సూచించారు. నియోజకవర్గంలో జరుగుతున్న పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటరాంరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు అన్ని వసతులు కల్పిస్తాం



రైల్వేస్టేషన్ వసతులు పరిశీలిస్తున్న నాగభూషణ్ రావు

ఆదిలాబాద్: రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని రకాల వసతులు అందుబాటులోకి తెస్తామని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ కె. నాగభూషణ్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్లో జరుగుతున్న పిట్ లైన్ నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్లో ఉన్న అధికారులు, సిబ్బంది గదులను, ప్రయాణికుల వెయిటింగ్ గదులను పరిశీలించి సౌకర్యాల గురించి ఆరా తీశారు. స్టేషన్‌లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై చర్చించారు. రెండో ఫుట్‌బ్రిడ్జికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు.

కడెం నుంచి జగిత్యాలకు బస్సు

కడెం: గతంలో ఖానాపూర్–జగిత్యాలకు ఉన్న బస్సు రూటు మార్చి కడెం మీదుగా ప్రారంభించినట్లు జగిత్యాల డిపో మెనేజర్ నర్సప్ప తెలిపా. జగిత్యాల నుంచి ఖానాపూర్‌కు ఉదయం 6:20, 11:50 ఖానాపూర్ నుంచి జగిత్యాలకు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రోజు రెండు ట్రిప్పులు నడుస్తుందని పేర్కొన్నారు. ఈ బస్సు ఖానాపూర్, లింగాపూర్, మద్దిపడగ, ధర్మాజీపేట్, కడెం, బెల్లాల్, బోర్నపల్లి మీదుగా జగిత్యాలకు చేరుకుంటుందని తెలిపారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ చేసి యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. పేపర్ లీక్ చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణ్, నిఖిల్, అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

తాంసి(బోథ్): మండలంలోని పాలోది గ్రామంలో గురువారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పత్తిపంట దగ్ధమైంది. పాలోది గ్రామ సర్పంచ్ శంకర్ దాదాపు 90 క్వింటాళ్ల పత్తిని ఇంట్లో నిల్వ చేసుకున్నాడు. ఇంటి ఆవరణలోని విద్యుత్ మోటార్‌ను ఆన్‌చేసే క్రమంలో నిప్పురవ్వలు చేలరేగి పత్తిపంటపై పడడంతో మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై నీటిని చల్లి మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో దాదాపు 5 క్వింటాళ్ల వరకు పత్తిపంట దగ్ధం కాగా రూ.40వేల వరకు నష్టం వాటిల్లిందని శంకర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



ప్రమాదంలో దెబ్బతిన్న పత్తి పంట

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కొట్టం దగ్ధం

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మారుతిగూడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కొట్టం దగ్ధమైంది. రైతు యేర్మ మోతిరావ్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం వ్యవసాయ చేనుల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలో ఉన్న కొట్టం పూర్తిగా దగ్ధమైంది. కొట్టంలో నిల్వ ఉంచిన 5 క్వింటాళ్ల కందులు, 2 క్వింటాళ్ల జొన్నలు, పైప్‌లు, స్ప్రే పంపులు పూర్తిగా మంటాల్లో కాలిపోయాయి. సుమారు రూ.1లక్ష 45వేల ఆస్తి నష్టం సంభవించిందని రైతు వాపోయాడు. రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు పరిహారం అందేవిధంగా కృషి చేయాలని కోరాడు.

భైంసా, బాసరలో ఆర్‌ఏఎఫ్ కవాతు



బాసరలో కవాతు చేపడుతున్న బలగాలు



మాట్లాడుతున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

భైంసా/భైంసాటౌన్: భైంసా, బాసర పట్టణాల్లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్) గురువారం రూట్ మార్చ్ నిర్వహించాయి. భైంసా పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన వీధులతోపాటు సున్నిత ప్రాంతాల్లో బలగాలు కవాతు చేశాయి. అంతకుముందు ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సున్నిత ప్రాంతాల్లో ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు తగ్గించడంతోపాటు శాంతిభద్రతలపై నమ్మకం కలిగించేందుకు ఆర్ఏఎఫ్ బలగాలు కవాతు నిర్వహిస్తాయన్నారు. ప్రకృతి వైపరీత్యాలైన భూకంపాలు, వరదలు వంటివి సంభవించినప్పుడు ప్రజల రక్షణ కోసం ఆయా ప్రాంతాలపై అవగాహన కోసం ఫ్లాగ్‌మార్చ్ చేపడుతున్నట్లు తెలిపారు. బాసరలో రైల్వేస్టేషన్ ప్రాంతం నుంచి ప్రధాన వీధులతోపాటు ఆలయ పరిసరాల్లో కవాతు నిర్వహించాయి. పండుగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కవాతు నిర్వహించినట్లు సీఐ వినోద్‌రెడ్డి, ఎస్సై మహేశ్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బేల: మండలంలోని బెదోడ గ్రామానికి చెందిన యువకుడు ఠాక్రే సంకేత్(21) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు ఠాక్రే వినోద్ చిన్న కుమారుడు సంకేత్ వరంగల్ జిల్లాలో డిగ్రీ చదువుతున్నాడు. వారం రోజుల క్రితం ఇంటికొచ్చాడు. గురువారం ఉదయం ఎడ్లను తీసుకుని మేపడానికి గ్రామ శివారులోని పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం 3గంటల సమయంలో తండ్రి వినోద్ కుమారుడికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. తండ్రి పొలానికి వెళ్లి పశువుల పాకలో చూడగా విగతజీవిగా కన్పించాడు. తన కుమారుడు మతిస్థిమితం లేక ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి పోలీసులకు తెలిపాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లింగన్న పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన అలిశెట్టి పూజితా రాణి(22) రెండురోజులుగా కనిపించడం లేదని ఆమె తల్లి అలిశెట్టి భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేశారని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. భాగ్యలక్ష్మి తన ఆరోగ్యం బాగోలేదని బుధవారం ఆసుపత్రికి తన చిన్న కుమార్తెను తీసుకుని వెళ్లింది. మధ్యాహ్నం 3:30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా పెద్దకుమార్తె పూజితారాణి కనిపించలేదు. దీంతో గ్రామంలోని చుట్టుపక్కల ఇళ్లలో, ఆమె స్నేహితులు, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. చివరకు ఆయా గ్రామాల్లో తమ బంధువుల ఇళ్లలోనూ ఆరాతీశారు. అయినా సమాచారం తెలియకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సంకల్పం ముందు వైకల్యం ఎంత!



అన్న భోజరాంతో కలిసి పరీక్ష కేంద్రానికి వచ్చిన గంగసాగర



పరీక్ష రాసేందుకు వెళ్తున్న గంగసాగర

భైంసాటౌన్/ముధోల్: పుట్టుకతో వచ్చిన అంగవైకల్యం చూసి చుట్టూ ఉన్నవారు హేళనగా చూసినా, తన కాళ్లపై తాను నిలబడాలన్న సంకల్పంతో చదువునే నమ్ముకుంది ఈ ఫోటోలో కన్పిస్తున్న విద్యార్థిని. ముధోల్ మండల కేంద్రానికి చెందిన సిరిగిరి గంగసాగర గీర్వాని జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. గురువారం నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కావడంతో తన అన్న భోజరాం సహాయంతో పరీక్ష కేంద్రానికి వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించి తన కుటుంబానికి అండగా నిలబడుతానని ఆమె చెబుతోంది.

విద్యుత్ వినియోగదారుల సదస్సుకు స్పందన కరువు

సారంగపూర్: మండల కేంద్రంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సదస్సుకు స్పందన కరువైంది. లక్ష్మణచాంద, దిలావర్‌పూర్, సారంగాపూర్, నిర్మల్ రూరల్ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి ఏర్పాటు చేసిన సదస్సులో కేవలం ఒకే ఒక్క ఫిర్యాదు రావడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. అదికూడా మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన ఓ వినియోగదారుడు తనకు నెలవారీ బిల్లు అధికంగా వస్తుందని ఫిర్యాదు చేశాడు. మిగతా నలుగురైదుగురు వినియోగదారులు సదస్సుకు హాజరైనప్పటికీ అందింది మాత్రం ఒకేదరఖాస్తు అని ఏఈ సాయికిరణ్ తెలిపారు. చివరకు అధికారులు వినియోగదారుల కోసం వేచి చూసి వెనుదిరిగే పరిస్థితి ఏర్పడింది. కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ ఈశ్వరయ్య, టెక్నికల్ సభ్యుడు అశోక్, ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కిషన్, భూమారెడ్డి, స్థానిక విద్యుత్ సిబ్బంది హాజరయ్యారు.



ఫిర్యాదు స్వీకరిస్తున్న అధికారులు

కారును ఢీకొన్న లారీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో కారు దెబ్బతింది. బేల మండలం పలాయి తండాకు చెందిన రాథోడ్ ధరంసింగ్ ఆదిలాబాద్ పట్టణంలోని నేతాజీచౌక్ నుంచి బేల వైపు కారులో వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు.

సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ ఒకరి మృతి

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మండలంలోని బొగ్గుగుట్ట గ్రామానికి చెందిన ఆత్రం దేవురావు (30) సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. ఎస్సై బి.సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు గురువారం ఉదయం ఇంట్లో సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. మృతుడి అన్న రాంషావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య నీలాదేవి, ఇద్దరు సంతానం ఉన్నారు.